

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరుతున్న వారికి పార్టీ కండువా కప్పుతున్న మల్కాజిగిరి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్‌రెడ్డి

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి భారీగా చేరికలు

బేగంపేట, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): అవినీతి కుంభకోణాలు... ఫోన్ ట్యాపింగ్‌తో బీఆర్ఎస్ పని అయిపోయిందని తెలుసుకున్న బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్‌లో చేరుతున్నారని మల్కాజిగిరి పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్‌రెడ్డి అన్నారు. శనివారం రాత్రి బేగంపేట మయూరిమార్గ్‌లో నగర కాంగ్రెస్ నేత రమేష్ ఆధ్వర్యంలో అల్లంతోటబాయి, ప్రకాశ్‌నగర్, శ్యామ్‌లాల్ బిల్డింగ్, మాతాజీనగర్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకులు భారీ సంఖ్యలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పట్నం సునీతా మహేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, బండి రమేష్ వారికి పార్టీ కండువా కప్పి పార్టీలో ఆహ్వానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అమరం శ్రీనివాస్‌రెడ్డి, జాన్, జైపాల్, హసిటోచర్, కరుణాకర్, పద్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బాపునగర్‌లో కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న నీలిమ

అమీర్‌పేట డివిజన్‌లో...

అమీర్‌పేట, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): అమీర్‌పేట డివిజన్ బాపునగర్‌కు చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు ప్రకాష్, పవన్, సతీష్‌తో పాటు మరో 50 మంది కార్యకర్తలు ఆదివారం సనత్‌నగర్ నియోజకవర్గం ఇన్‌చార్జి కోట నీలిమ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వీరికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం నీలిమ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై తమ పార్టీలోకి చేరుతున్నట్లు వెల్లడించారు. రాబోయే ఎన్నికల్లో సత్తా చాటడం ఖాయమన్నారు.

నగర నేతకు బీజాపూర్ పార్లమెంటు బాధ్యతలు



సయ్యద్ బురానుద్దీన్

బంజారాహిల్స్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రం బీజాపూర్ పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ మైనార్టీ శాఖ ఇన్‌చార్జిగా జూబ్లీహిల్స్‌కు చెందిన ఆ పార్టీ సీనియర్ నేత సయ్యద్ బురానుద్దీన్‌ను నియమించారు. ఈ మేరకు ఏఐసీసీ మైనార్టీ శాఖ నేషనల్ కో ఆర్డినేటర్ జీనల్ ఎస్ గాల ఆయనకు ఉత్తర్వులు అందజేశారు. ఆదివారం జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం నుంచి కర్ణాటక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్లమెంటరీ ఇన్‌చార్జిగా తన ఒక్కడికే ఈ అవకాశం దక్కిందని, రాహుల్ గాంధీ ప్రత్యేక శ్రద్ధతో తనను నియమించారని వెల్లడించారు. బీజాపూర్లో ఐదు లక్షల మంది మైనారిటీ ఓటర్లు ఉన్నారని, వారందరినీ ఏకం చేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కేహెచ్ ఆలూర్‌ను భారీ మెజారిటీతో గెలిపించి రాహుల్ గాంధీకి బహుమతిగా ఇస్తామన్నారు. తనపై నమ్మకం ఉంచి అప్పగించిన ఈ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని రాహుల్ గాంధీకి కృతజ్ఞతలు తెలిపారు.



నిమ్స్ వ్యవస్థాపక డైరెక్టర్ ప్రొఫెసర్ కాకర్ల సుబ్బారావు మూడో వర్ధంతి సందర్భంగా నిర్వహించిన సీఎంఈలో పాల్గొన్న వైద్యులు

నిమ్స్‌లో అంకో ఇమేజింగ్‌పై సీఎంఈ

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): నిమ్స్ వ్యవస్థాపక డైరెక్టర్ ప్రొఫెసర్ కాకర్ల సుబ్బారావు మూడోవ వర్ధంతి సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంకో ఇమేజింగ్‌పై సీఎంఈని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలు రకాల కేన్సర్లపై వైద్యులు మాట్లాడారు. కేన్సర్‌లో చోటు చేసుకున్న కొత్త చికిత్సలు, రోగ నిర్ధారణ పరీక్షలపై చర్చించారు. కార్యక్రమంలో కేన్సర్ నిపుణులు, రేడియాలజిస్టులు, న్యూక్లియర్ మెడిసిన్ ఫిజిషయన్లు పాల్గొని తమ అనుభవాలను వివరించారు. డాక్టర్ సెంథిల్ రాజప్ప ప్రొస్టేట్ కేన్సర్‌పై ప్రసంగించారు. నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఎన్ బీరప్ప, దివంగత ప్రొఫెసర్ కాకర్ల సుబ్బారావు కుటుంబ సభ్యులను సత్కరించారు. కార్యక్రమంలో వైద్యులు సదాశివుడు, మధుర్ కుమార్ శ్రీవాస్తవ, ప్రొఫెసర్ డాక్టర్ కవితలను సత్కరించారు.



గాత్ర కచేరీలో గాత్రం చేస్తున్న సంగీత చూడామణి, సప్తగిరి సంగీత విద్వన్మణి హరిప్రియ

ఆకట్టుకున్న సంగీత చూడామణి హరిప్రియ గాత్ర కచేరి

పంజాగుట్ట, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్ ఆనందనగర్ కాలనీ విజ్ఞాన సమితి వేద వేదాంత సంగీత సాహిత్య ప్రచార సభ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ఆనందనగర్ కమ్యూనిటీ హాల్‌లో విజ్ఞాన సమితి వ్యవస్థాపకుడు కీర్తి శేషులు వేమూరి ముక్తేశ్వర రావు 102వ జయంతి ఘనంగా జరిగింది. ప్రఖ్యాత మృదంగం విద్వాంసులు డాక్టర్ ఎల్ల వేంకటేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. వేమూరి ముక్తేశ్వర రావు, ప్రఖ్యాత గాత్ర విద్వాంసులు దరూరి రాఘవాచారి, ప్రఖ్యాత వీణ విద్వాంసులు అయ్యగారి శ్యామసుందరం చేసిన సేవలను ఆయన కొనియాడారు. ఈ సందర్భంగా సంగీత చూడామణి, సప్తగిరి సంగీత విద్వన్మణి బి.హరిప్రియ గాత్ర కచేరీ ఆకట్టుకుంది. ఆర్.దినకర్ వయొలిన్ తోను, డాక్టర్ డి.ఎస్.ఆర్.మూర్తి మృదంగం, కే.శ్యామ్ కుమార్ కంజీరాతో సహకారం అందించారు. విజ్ఞాన సమితి అధ్యక్షుడు సూరి వెంకటేశ్వర్లు, కార్యదర్శి సుజ్ఞాన్, కాలనీ వాసులు, సంగీత ప్రియులు పాల్గొన్నారు.

కారును నిర్లక్ష్యంగా నడిపి.. ప్రభుత్వ ఆస్తి ధ్వంసం

బంజారాహిల్స్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): కారును నిర్లక్ష్యంగా నడిపి విద్యుత్ స్తంభం ధ్వంసం అవడానికి కారణమైన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నెల 13న బంజారాహిల్స్ రోడ్డు నంబరు 1 నుంచి 10 మీదుగా వెళుతున్న ఓ మెర్సిడీస్ బెంజ్ అదుపు తప్పి డివైడర్ ఎక్కి. విద్యుత్ పోల్‌ను ఢీ కొట్టింది. ఈ ఘటనలో విద్యుత్ స్తంబం కూలడంతో పాటు ఫ్యూజ్ బాక్స్ ధ్వంసం అయింది. కారుడ్రైవర్ నిర్లక్ష్యంగా నడపటం వల్లే విద్యుత్ స్తంభం, ఫ్యూజ్ బాక్స్ ధ్వంసం అయ్యాయని ట్రాన్స్‌కో ఏఈ వేణుమాదవ్ ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు సెక్షన్ 279, 336 ఐపీసీతోపాటు సెక్షన్ 3 ఆఫ్ పీడీపీపీ యాక్ట్ కింద కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఫిలింనగర్‌లో....

షేక్‌పేట నుంచి ఫిలింనగర్‌వైపు వెళ్తున్న వెర్నాకారు ఈ నెల 13న అదుపు తప్పి ఫుట్‌పాత్‌ను ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఫుట్‌పాత్ ధ్వంసం అయింది. దీంతో ఫిలింనగర్ పోలీసులు కారు నడుపుతున్న సయ్యద్ అఫన్ ఉల్లాహ పై 279, 336 ఐపీసీతోపాటు సెక్షన్ 3 ఆఫ్ పీడీపీపీ యాక్ట్ కింద కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



పంజాగుట్టలోని అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే దానం నాగేందర్, కార్పొరేటర్ వనం సంగీతా యాదవ్, తదితరులు



ఫిలింనగర్ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, తదితరులు



యూసుఫ్‌గూడ బస్తీ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి, కేక్ పంచుతున్న ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

వాడవాడలా అంబేడ్కర్ జయంతి

ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, సనత్‌నగర్ జోన్ బృందం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, సనత్‌నగర్ నియోజకవర్గాలలో డా.బీఆర్ అంబేద్కర్ జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లో జరిగిన వేడుకల్లో ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, విద్యార్థి సంఘాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ చేసిన సేవలను కొనియాడారు.



బేగంపేటలో అంబేద్కర్ జయంతిలో సనత్‌నగర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కోట నీలిమ, తదితరులు



నెహ్రూపార్క్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి



నివాళులర్పిస్తున్న జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్, తదితరులు



ప్రేమ్‌నగర్‌లో నివాళులర్పిస్తున్న జాతీయ ఎస్సీ ఎస్టీ ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ నాను, చంద్రశేఖర్, కిరణ్, ఆంజనేయులు తదితరులు



ఎర్రగడ్డ బీఆర్ఎస్ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న డివిజన్ అధ్యక్షుడు సంజీవ, నాయకులు



అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నేషనల్ హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టిస్ కమిషన్ తెలంగాణ రాష్ట్ర చైర్మన్ ఎస్ శివశంకర్, సభ్యులు



అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీజేపీ ఎర్రగడ్డ డివిజన్ అధ్యక్షుడు రాజేష్, ప్రధాన కార్యదర్శి విజయ్ కుమార్, తదితరులు



సైట్-3 అంబేద్కర్ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న బాబా ఫసియుద్దీన్, తదితరులు



అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు



అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి విజయారెడ్డి, తదితరులు



ఎర్రగడ్డలో అంబేద్కర్ జయంతిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నవీన్ యాదవ్, రవిగౌడ్, కృష్ణకుమార్



అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న శ్యామల కుంట బస్తీ అధ్యక్షుడు పుట్టల శేఖర్, తదితరులు



ఫిలింనగర్‌లో నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు నర్సింహులు, మల్లేష్, గోవింద్ తదితరులు



ప్రతాప్‌నగర్‌లో నివాళులర్పిస్తున్న టీఎంఆర్‌పీఎస్ యువసేన అధ్యక్షుడు నల్ల శివమాదిగ, తదితరులు



రహ్మత్‌నగర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ సిఎన్ రెడ్డి

దేశం కోసం ఓటు వేయండి..

● పార్లమెంట్ ఎన్నికల్లో పోలింగ్ శాతం పెంచాలి ● కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

వెంగళరావునగర్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): దేశ అభివృద్ధి కోసం ఓటు వేయండి, పార్లమెంట్ ఎన్నికల్లో పోలింగ్ శాతం పెంచాలని కేంద్రమంత్రి, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి జి.కిషన్ రెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి వెంగళరావునగర్ సంక్షేమ సమితి అధ్యక్షుడు చిలకల వెంకటేశ్వరరావు అధ్యక్షతన సమితి కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాలనీ సంక్షేమ సమితి అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి దనుంజయ రెడ్డి, సమితి ప్రతినిధులు ఆయనకు తమ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. నిరుపయోగంగా ఉన్న వాటర్ ట్యాంక్‌ను తొలగించి కాలనీ అభివృద్ధి కార్యక్రమాల కోసం కేటాయించాలని, కాలనీలో జీహెచ్ఎంసీ నిర్మిస్తున్న మల్టీ పర్పస్ కమ్యూనిటీ హాల్ నిర్వహణను కాలనీ సంక్షేమ సమితికి అప్పగించాలని కిషన్ రెడ్డిని కోరారు. మే 13న పార్లమెంట్ ఎన్నికల్లో పోలింగ్ శాతం పెంచాలని, తరువాత బీజేపీకి ఓటు వేసి గెలిపించాలని కాలనీవాసులను కోరారు. గడిచిన పది సంవత్సరాల కాలంలో దేశంలో ప్రధాని నరేంద్ర మోదీ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. నగరంలోని సికింద్రాబాద్, హైదరాబాద్, కాచిగూడ రైల్వేస్టేషన్‌లను సుమారు ఏడు వందల కోట్లకు పైగా రూపాయలతో అభివృద్ధి చేస్తున్నామన్నారు. చర్లపల్లిలో కొత్త రైల్వేస్టేషన్ నిర్మిస్తున్నామని సికింద్రాబాద్ నుంచి విశాఖపట్నం, తిరుపతి, బెంగళూరుకు వందే భారత్ రైళ్లను నడుపుతున్నామన్నారు. సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో బస్తీలు, కాలనీలు అనే తేడా లేకుండా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామన్నారు. మహిళల కోసం స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. కాలనీవాసులు మే 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో అర్హులైన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఆ రోజు పోలింగ్ బూత్ కు వెళ్లి ఓటు హక్కును వినియోగించుకోవాలి కోరారు. తనను మరో సారి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

కార్యక్రమంలో సమితి ప్రధాన కార్యదర్శి దనుంజయ రెడ్డి, ఉపాధ్యక్షులు ఎస్.అర్జున్, శౌరి రాజు, కోశాధికారి రాజశేఖర్, మాజీ అధ్యక్షుడు రాజశేఖర్ గుప్త, సభ్యులు రామకోటయ్య, పంపాపతి రెడ్డి,సంజీవ రావు,సునీత, కె.శ్రీనివాస్, ప్రసాద్,నటరాజ్,రవి కుమార్,తదితరులు పాల్గొన్నారు.



వెంగళరావునగర్ సంక్షేమ సమితి ఆత్మీయ సమ్మేళనంలో కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి

వెంగళరావునగర్‌లో జీపు యాత్ర...

వెంగళరావునగర్ డివిజన్‌లో ఆదివారం రాత్రి కేంద్ర మంత్రి, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి జి.కిషన్ రెడ్డి జీపు యాత్రను నిర్వహించారు. మధురానగర్, వెంగళరావునగర్,"సిద్ధార్థ నగర్, జవహర్ నగర్,రహమత్ నగర్‌లలో యాత్ర జరిగింది. ఆయా ప్రాంతాల్లో కార్నర్ మీటింగులలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు గౌతమ్ రావు, నాయకులు లంకాల దీపక్ రెడ్డి, మాజీ కార్పోరేటర్ కిలారి మనోహర్, కుంబాల గంగరాజు,బీజేపీ నాయకులు డాక్టర్ పద్మ, కీర్తిరెడ్డి, ప్రేమ్ కుమార్, విజయ్,సుప్రియా గౌడ్, అనన్య రెడ్డి, జబ్బార్, తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా ట్యాంక్ బండ్‌పై ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన దళిత స్త్రీ శక్తి జాతీయ కన్వీనర్ ఝాన్సీ గడ్డం, తదితరులు. రాజ్యాంగాన్ని కాపాడుకుందాం. దేశాన్ని రక్షిద్దాం అనే నినాదాలను చేశారు.

- హైదరాబాద్ సిటీ, ఆంధ్రజ్యోతి



ట్రోఫీతో సీఎఫ్‌సీ జట్టు

టీ20 విజేత సీఎఫ్‌సీ

● టోర్నీ ఉత్తమ ప్లేయర్‌గా త్రిష

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): నెక్స్ జెన్ ఉమెన్స్ టీ-20 ట్రోఫీను సెంటర్ ఫర్ క్రికెట్ (సీఎఫ్‌సీ) ఎక్స్‌లెన్స్ అకాడమీ జట్టు కైవసం చేసుకుంది. ఆదివారం జరిగిన ఫైనల్లో సీఎఫ్‌సీ 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన కోచింగ్ బియాండ్ (సీబీ) జట్టు 20 ఓవర్లలో 121కు ఆలౌటైంది. ఛేదనలో సీఎఫ్‌సీ 15.5 ఓవర్లలో ఒక్క వికెట్ మాత్రమే నష్టపోయి 122 పరుగులు చేసి, నెగ్గింది. ఓపెనర్ రమ్య అర్ధ శతకం (72 నాటౌట్)తో జట్టును విజయ తీరాలకు చేర్చింది. ఆల్‌రౌండర్ జి.త్రిషా రెడ్డి తొలుత బంతితో మూడు (3/28) వికెట్లు తీసి సత్తా చాటగా, ఆతర్వాత బ్యాటింగ్‌లో 44 పరుగులు చేసి, జట్టు గెలుపులో కీలకపాత్ర పోషించింది. ఇక, ఈ టోర్నీలో 310 పరుగులు, 11 వికెట్లు తీసిన త్రిషకు ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ అవార్డు లభించింది.

ఫుట్‌పాత్, రహదారి ఆక్రమణదారులపై చర్యలు..

వెంగళరావునగర్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): వెంగళరావునగర్ కాలనీలో ఫుట్‌పాత్, రహదారులు ఆక్రమించి వ్యాపారులు నిర్వహించవద్దని వెంగళరావునగర్ సంక్షేమ సమితి అధ్యక్షుడు చిలకల వెంకటేశ్వరరావు సూచించారు. ఆదివారం కాలని సంక్షేమ సమితి ఉపాధ్యక్షుడు అర్జున్, కాలనీవాసులు ప్రభుత్వ పాఠశాల, బ్రహ్మం టాలెంట్ స్కూల్ మార్గంలో ఫుట్‌పాత్, రహదారులు ఆక్రమించి చిరు వ్యాపారులు వారిపై ఇబ్బందులు కలిగిస్తున్న వారిని హెచ్చరించి, ఫుట్‌పాత్, రహదారిపై ఉన్న టిఫిన్ సెంటర్లను స్వయంగా వారితోనే తొలగింప చేశారు.



సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న కళాకారులు

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

మాదాపూర్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): శిల్పారామం, శ్రీనివాస ఆర్ట్ అకాడమీ సంయుక్తాధ్వర్యంలో కీర్తి శేషులు పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ శోభానాయుడుకు శిష్య బృందం "శోభాభినయం" కూచిపూడి నృత్య నీరాజనాన్ని సమర్పించారు. గురువులు కృష్ణ భారతి, విజయ శాస్త్రి , గురు యశోద ఠాకూర్, పద్మ హేమమాలిని, దేవదాస్, బసవ లావణ్య, వైష్ణవి, సంగీత రామ కృష్ణ, పూర్ణిమ, సుధీర్ రావు, శ్రీదేవి ముంగర, సుజాత మూర్తి, సాయి శివరంజని నాయుడు, ఉష గోటేటి, శోభా గోపు, ఉషాకిరణ్ మొదలైన వారు వారి శిష్య బృందంచే జయము జయము, భో శంభో, సువ్వి, మామవతు శ్రీ సరస్వతి, భావయామి, తీరు తీరు, దుర్గ, ధనశ్రీ తిల్లాన మొదలైన అంశాలను ప్రదర్శించి నాట్య నీరాజనాలు అర్పించారు. ప్రముఖ నాట్య గురువర్యులు అలేఖ్య పుంజాల, అంజుబాబు, గాయని నిత్యా సంతోషిణీ, వేణువు విద్వాన్సులు దత్తాత్రేయులు, గురువుసుధీర్ రావు ముఖ్య అతిథులుగా విచ్చేసి కలార్పణం అందించారు.



శిక్షణ పూర్తయిన వారికి సర్టిఫికెట్లను ప్రదానం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యులు

గణేష్ ఉత్సవ కమిటీ ఉచిత కంప్యూటర్ శిక్షణకు 20 ఏళ్లు

ఖైరతాబాద్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): పేదలు, విద్యార్థులు, గృహిణులకు ఉచిత కంప్యూటర్ శిక్షణ అందిస్తూ ఉపాధి పరంగా ఆదుకుంటున్న ఖైరతాబాద్ గణేష్ ఉత్సవ కమిటీ 20వ వార్షికోత్సవాన్ని జరుపుకుంది. ఈ సందర్భంగా శిక్షణా కేంద్రంలో ఆదివారం వేడుకలు జరిగాయి. శిక్షణ పూర్తయిన పలువురు శిక్షార్థులకు జూబ్లీహిల్స్ మాజీ ఎమ్మెల్యే పి.విష్ణువర్ధన్‌రెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యులు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. నిర్వాహకుడు రాజ్‌కుమార్ మాట్లాడుతూ 20 సంవత్సరాల క్రితం అప్పటి సిఎల్పీ నేత దివంగత పి.జనార్ధన్‌రెడ్డి ఉచిత కంప్యూటర్ శిక్షణను ప్రారంభించారని గుర్తు చేశారు. ప్రస్తుతం ఉచిత వేసవి శిక్షణ సైతం జరుగుతోందని, ఈ అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగపరచుకోవాలని కోరారు. కార్యక్రమంలో గణేష్ ఉత్సవ కమిటీ కన్వీనర్ సందీప్‌రాజ్, కార్యదర్శి రాజ్‌కుమార్, సభ్యులు వీణా మాధురి, రవికాంత్‌రెడ్డి, మురళి తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం స్వాధీనం



జీడిమెట్ల, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని గాంధీనగర్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దాదాపు 35 ఏళ్ల వయస్సు కలిగిన వ్యక్తి ఐడీపీఎల్ కాలనీ నుంచి జగద్గిరిగుట్ట వెళ్లే దారిలో గల వివేకానంద విగ్రహం వద్ద మృతి చెంది ఉన్నాడు. స్థానికులు జీడిమెట్ల పోలీసులకు సమాచారం అందించగా పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పీడీఎస్ బియ్యం స్వాధీనం

జీడిమెట్ల, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): పీడీఎస్ బియ్యాన్ని విక్రయిస్తున్న వ్యక్తిని బాలానగర్ ఎస్‌ఓటీ, జీడిమెట్ల పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అతడి నుంచి 95 వేల రూపాయల విలువచేసే 3,800కిలోల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. సుభాష్‌నగర్‌కు చెందిన సంగిశెట్టి వెంకటేశ్వర్లు(52) అనే వ్యక్తి కొంతకాలంగా పెద్దఎత్తున రేషన్ బియ్యం సేకరించి అధిక ధరలకు విక్రయిస్తున్నాడు. పక్కా సమాచారం అందుకున్న పోలీసులు దాడులు చేసి బియ్యం స్వాధీనం చేసుకున్నారు. వెంకటేశ్వర్లును రిమాండ్‌కు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్రికెట్ బెట్టింగ్ ముఠా అరెస్ట్

మియాపూర్, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): ఎస్‌ఓటీ మేడ్చల్, మియాపూర్ పోలీసులు సంయుక్తంగా మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మాతృశ్రీనగర్‌లో ఆన్‌లైన్ బెట్టింగ్ నిర్వహిస్తున్న ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి ఒక లక్షా 96 వేల రూపాయల నగదు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.


కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి దానం నాగేందర్‌ను కలిసిన సికింద్రాబాద్ నియోజకవర్గ నాయకులు

దానం నాగేందర్ గెలుపునకు కృషి

● కాంగ్రెస్ నాయకులు

బౌద్ధనగర్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆదివారం ఖైరతాబాద్ శాసనసభ్యుడు, సికింద్రాబాద్ లోకసభ అభ్యర్థి దానం నాగేందర్‌ను కలిశారు. సికింద్రాబాద్ ఏ, బీ, బ్లాక్ అధ్యక్షులు జగదీశ్వరరావు(జగ్గు), సురేష్‌లాల్ ఆధ్వర్యంలో నాయకులు దేవేందర్‌రెడ్డి, శాస్త్రి, రత్నకుమారి, మహ్మద్ జహంగీర్, పాల్, వేణుగౌడ్, యాది, రాజు, ఖరీం తదితరులు దానం నాగేందర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. లోకసభ ఎన్నికల్లో సికింద్రాబాద్ పార్లమెంట్ అభ్యర్థి దానం నాగేందర్ గెలుపుకోసం తమవంతు కృషి చేస్తామని వారు తెలిపారు.


బొల్లారం కంటోన్మెంట్ పార్క్‌లో వాకర్స్ పాదయాత్ర

బొల్లారం కంటోన్మెంట్ పార్క్‌లో వాకర్స్‌తో సమావేశం

తిరుమలగిరి, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): బొల్లారంలోని కంటోన్మెంట్ పార్క్‌లో వాకర్స్‌తో ఆదివారం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, మల్కాజ్‌గిరి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిత కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జక్కుల మహేశ్వర్ రెడ్డి, బోర్డు మాజీ సభ్యులు లోకనాథం, కార్పొరేటర్ శాంతిరెడ్డిలు బొల్లారం పార్కులో వాకర్స్‌తో భేటీ అయ్యారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాల గురించి వాకర్స్‌కు వివరించారు. బీఆర్ఎస్ పార్టీలోనే ప్రజలందరికీ న్యాయం జరుగుతుందన్నారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిగా రాగిడి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి నివేదితను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. వార్డ్-8 బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రవికుమార్, చందర్, యువ నాయకుడు శివ పాల్గొన్నారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య


భాస్కర్‌గౌడ్ (ఫైల్)

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : మద్యానికి బానిసైన ఓ వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న ఘటన లాలాగూడ రైల్వే స్టేషన్ సమీపంలో చోటుచేసుకుంది. సికింద్రాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ డేవిడ్ రాజు తెలిపిన వివరాల ప్రకారం నాచారం శ్రీరాంనగర్‌కు చెందిన భాస్కర్‌గౌడ్(42) కూలీ పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి భార్య, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. తాగుడికి బానిస కావడంతోపాటు పనికిపోకవెళ్లకుండా భార్యతో గొడవ పడడంతో రెండేళ్ల క్రితం భార్య, ముగ్గురు కూతుళ్లు పుట్టింటికి వెళ్లిపోయారు. అప్పటి నుంచి భాస్కర్‌గౌడ్ నాచారంలోని సోదరుడి వద్ద ఉంటున్నాడు. ఆర్థికపరమైన ఇబ్బందులు తాగుడికి బానిసైన ఆయన ఆదివారం లాలాగూడ - మౌలాలి రైల్వే స్టేషన్ సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని భార్యకు అప్పగించామని పోలీసులు తెలిపారు. .

మనోవ్యథతో మరొకరు..

అల్వాల్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ఒకవైపు అనారోగ్య సమస్యలు, మరోవైపు ఒంటరితనంతో మనోవ్యధకు గురైన ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటాపురం ప్రాంతంలో నివసించే నగ్నూర్ బిపిన్‌కుమార్(38)కు పది సంవత్సరాల క్రితం లాస్యతో వివాహం జరిగింది. ఈ దంపతులకు మూడు సంవత్సరాల పాప ఉంది. నాలుగు సంవత్సరాల క్రితం భార్య లాస్య భర్త బిపిన్‌కుమార్‌తో గొడవపడి ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. అప్పటి నుంచి ఓ ప్రైవేటు సంస్థలో ఉద్యోగం చేసుకుంటూ, 70 సంవత్సరాల తండ్రి అశోక్‌కుమార్‌తో కలిసి నివసిస్తున్నాడు. భార్యలేని జీవితంతో రెండు సంవత్సరాలుగా బిపిన్‌కుమార్ మానసిక ఒత్తిడికి గురవుతున్నాడు. ఇదే క్రమంలో వెన్నుకు సంబంధించిన అనారోగ్య సమస్యలు తలెత్తడంతో గత కొన్ని నెలలుగా ఉద్యోగం మానేసి ఇంట్లోనే ఉంటున్నాడు. ఈనెల 3వ తేదీన తండ్రితో కలిసి భోజనం చేశాడు. ఆ తరువాత బెడ్‌రూంలోకి వెళ్లాడు. కొద్ది సేపటికి అతని తండ్రి అశోక్‌కుమార్ గమనించగా ఉరివేసుకుని ఉన్నాడు. వెంటనే స్థానికుల సహకారంతో కొన ఊపిరితో ఉన్న బిపిన్‌కుమార్‌ను స్థానికంగా ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ కొన్ని రోజులు చికిత్స పొందిన తరువాత, అక్కడి నుంచి గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


బ్రాహ్మణ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో శ్రీ వేంకటేశ్వర కల్యాణంలో ఈటల జమున, తదితరులు

కమనీయం.. రమణీయం వేంకటేశ్వర కల్యాణం

మల్కాజిగిరి, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి మల్కాజిగిరి ఆనంద్‌బాగ్‌లోని బృందావన్ గార్డెన్స్‌లో లోకకళ్యాణార్థం నిర్వహించిన వేంకటేశ్వర కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మల్కాజిగిరి లోక్‌సభ బీజేపీ అభ్యర్థి, మాజీ మంత్రి ఈటల రాజేందర్ దంపతులు పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్సీ ఎన్.రాంచందర్‌రావు, బ్రాహ్మణ ఐక్యవేదిక కన్వీనర్ లక్ష్మణ్, చీఫ్ కోఆర్డినేటర్ చక్రధర్, కార్పొరేటర్‌లు శ్రవణ్, రాజ్యలక్ష్మి, సునీతా చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ జయంతి వేడుకలను లష్కర్‌లో ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. సికింద్రాబాద్, సనత్‌నగర్, కంటోన్మెంట్‌లలో ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నేతలు, కుల సంఘాల, కార్మిక సంఘాల ప్రతినిధులు బాబా సాహెబ్‌కు నివాళులర్పించారు. మహనీయుడు అంబేడ్కర్ అని కొనియాడారు. భారత రాజ్యాంగం రూపకల్పనలో విశ్వవ్యాప్త ఖ్యాతి పొందారని వక్తలు అన్నారు.

- సికింద్రాబాద్, కంటోన్మెంట్, నత్‌నగర్ జోన్ బృందం (ఆంధ్రజ్యోతి)


అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కోట నీలిమ, తదితరులు


పికెట్ డాక్టర్ బీ.ఆర్ అంబేడ్కర్ సేవా సంఘం ఆధ్వర్యంలో టీఎస్‌పీసీసీ ప్రధాన కార్యదర్శి బొల్లు కిషన్, వివిధ సంఘాల నాయకులు, ప్రతినిధులు

వాడవాడలా అంబేడ్కర్ జయంతి


ఆదివారం లాలాపేట్‌లో డా.బీ.ఆర్.అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పిస్తున్న జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతశోభన్ రెడ్డి


సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి ఆవరణలో ఆదివారం అంబేడ్కర్ విగ్రహానికి గాంధీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజారావు పూలమాలవేసి నివాళులు అర్పించారు


బౌద్ధనగర్‌లో అంబేడ్కర్ జయంతి వేడుకల్లో క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్‌జాన్


బోయినపల్లిలో అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకుడు మర్రి అమరేందర్‌రెడ్డి


బొల్లారం ఆదర్శనగర్‌లోని బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిత, బోర్డు మాజీ సభ్యుడు లోక్‌నాథ్‌లు పూలమాలలు వేసి


ఆదయ్యనగర్ కమాన్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్


సీతాఫల్‌మండి చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీజేపీ ప్రధానకార్యదర్శి మేకలసారంగపాణి, తదితరులు


చిలకలగూడలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమలలు వేసి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకుడు మ్యాకల చంద్రశేఖర్


అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న కంటోన్మెంట్ మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్


విక్టోరియా గంజ్ చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న రాంగోపాల్‌పేట్ కార్పొరేటర్ చీర సుచిత్ర, తదితరులు


పార్సిగుట్ట చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ డిసిప్లినరీ కమిటీ చైర్మన్ రాగటి సత్యంమాదిగ తదితరులు


మెజీషియన్ సామల వేణుకు కాపురత్న అవార్డు అందజేస్తున్న కాపు సంఘం నాయకులు

కాపురత్న అవార్డుల ప్రదానం

రెజిమెంటల్‌బజార్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా తెలగ బలిజ కాపు సంఘం ఆధ్వర్యంలో వివిధ రంగాలలో నిష్ణాతులైన తెలగ బలిజ కాపు సామాజిక వర్గానికి చెందిన వారిని అవార్డులతో సన్మానించారు. ఆదివారం సికింద్రాబాద్‌లోని సప్తగిరి హోటల్‌లో అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. నాలుగు కాపు రత్న అవార్డులతో పాటు, 17 ఇతర అవార్డులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు కోటెల శ్రీహరి మాట్లాడుతూ.. కాపు కమ్యూనిటీలో ఉన్న ప్రతిభ గలవారికి కాపు సంఘం ద్వారా చేయూత అందించి ఉన్నతంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కాపు సంఘం పనిచేస్తుందని అన్నారు. 1959 సంవత్సరంలో కాపు సంఘం స్థాపించినట్లు తెలిపారు. లోయర్ ట్యాంక్‌బండ్‌లో ఆధునిక వసతులతో నిర్మిస్తున్న కాపు భవనం పూర్తికావస్తోందని అన్నారు. భవనం నిర్మాణం పూర్తి అయితే రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన కాపు సమాజానికి చెందినవారికి వసతి, ఫంక్షన్, స్కిల్‌డెవలప్‌మెంట్‌కు ఉపయోగపడుతుందని తెలిపారు. కాపురత్న అవార్డు అందుకున్న ప్రముఖ మెజీషియన్ సామలవేణు మాట్లాడుతూ...ఎన్నో అవార్డులు అందుకున్నప్పటికీ మా కమ్యునిటీ కాపు సంఘం నుంచి అవార్డు అందుకోవడం ఆనందంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు ఎస్.వి.రావు, జవాహర్, జాయింట్ సెక్రటరీ మారేశ్వరరావు, జనరల్ సెక్రటరీ వినాయక స్వామి, రమణారావు, శంకర్ బాబు తదితరులు పాల్గొన్నారు.


కాశీపురం కాలనీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతున్న మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు

కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యం

మచ్చబొల్లారం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో మల్కాజిగిరి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు పిలుపునిచ్చారు. ఆదివారం మచ్చబొల్లారం డివిజన్‌లోని కాశీపురం కాలనీలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మైనంపల్లి హన్మంతరావు మాట్లాడుతూ.. పలు కాలనీల ప్రజలు తమ సమస్యలను మైనంపల్లి దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన మైనంపల్లి హన్మంతరావు లోక్‌సభ ఎన్నికల అనంతరం సమస్యలను వెంటనే పరిష్కరిస్తానని కాలనీ ప్రజలకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పలు కాలనీల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్.. జాగ్రత్తగా మాట్లాడాలి

● పట్నం సునీతా మహేందర్‌రెడ్డిని డమ్మీ అంటావా

● మేడ్చల్‌లో కాంగ్రెస్ కన్నా ఒక్క ఓటు ఎక్కువ తెచ్చుకున్నా రాజకీయ సన్యాసం చేస్తా

● టీపీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేష్‌యాదవ్


తోటకూర వజ్రేష్‌యాదవ్

ఉప్పల్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): "కేటీఆర్.. మాటలు జాగ్రత్తగా మాట్లాడు. 20 సంవత్సరాల క్రితమే మూడుసార్లు ఉమ్మడి రంగారెడ్డి జల్లాపరిషత్ చైర్మన్‌గా ప్రజలకు సేవలందించిన మల్కాజ్‌గిరి లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునితా మహేందర్‌రెడ్డిని డమ్మీ అభ్యర్థి అంటావా" అంటూ టీపీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేష్‌యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ మంత్రి మల్లారెడ్డి కుమారుడు ఎంపీ పదవికి పోటీ చేయకుండా ఎందుకు తోక ముడిచారో చెప్పాలని, కనీసం పోటీ చేసేందుకు బీఆర్ఎస్ నుంచి ఎవరూ దొరక్కపోవడంతో ముక్కూమొహం తెలియని వ్యక్తిని మల్కాజ్‌గిరి బరిలో దించే దుస్థితి బీఆర్ఎస్‌కు దాపురించిందని ఆయన ఎద్దేవా చేశారు. ఆదివారం ఆయన బోడుప్పల్‌లోని తన నివాసంలో మీడియాతో మాట్లాడుతూ.. కేటీఆర్‌కు దమ్ముంటే మేడ్చల్ నియోజవకర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి కంటే ఒక్క ఓటు ఎక్కువ సాధించి చూపించాలని సవాల్ విసిరారు. అలా చేస్తే తాను రాజకీయాల నుంచి తప్పుకుంటా, లేదంటే మల్లారెడ్డితో ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయిస్తారా అంటూ ప్రశ్నించారు.


బాపునగర్‌లో కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న కోట నీలిమ

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి చేరికలు

అమీర్‌పేట, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): అమీర్‌పేట డివిజన్ బాపునగర్‌కు చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు ప్రకాష్, పవన్, సతీష్‌తోపాటు మరో 50 మంది కార్యకర్తలు ఆదివారం సనత్‌నగర్ నియోజకవర్గం ఇన్‌చార్జి కోట నీలిమ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారిని కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం నీలిమ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై తమ పార్టీలోకి చేరుతున్నట్లు వెల్లడించారు. ప్రజల మద్దతుతో రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో సైతం సత్తా చాటడం ఖాయమన్నారు. అనంతరం బాపునగర్‌లోని అల్మాస్ హోటల్ వీధి, అమర్‌సింగ్ నివాసం సమీపంలో పార్టీ శ్రేణులతో కలిసి కాంగ్రెస్ పార్టీ జెండాలను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు శ్రీనివాసరావు, ఎస్ఎస్.రెడ్డి, ప్రతాప్, గోదాస్ నవీన్, మధు, నవీన్‌రాజ్, గోవింద్, రవి, దుర్గాప్రసాద్, రజనీకాంత్ తదతరులు పాల్గొన్నారు.


కల్యాణ వేదిక పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ తదితరులు

మెగా బ్రాహ్మణ కల్యాణ వేదికకు మంచి స్పందన

మల్కాజిగిరి, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): కాస్రా బ్రాహ్మణ సేవా సమాఖ్య ఆధ్వర్యంలో ఆదివారం మల్కాజిగిరి బృందావన్ గార్డెన్స్‌లో నిర్వహించిన సిల్వర్ జూబ్లీ మెగా కల్యాణవేదికకు మంచి స్పందన లభించింది. సుమారు 6వందల కుటుంబాలు ఈ మెగా బ్రాహ్మణ వివాహ వేదికకు హాజరయ్యారు. కాగా ఇదే వేదికగా 15 కుటుంబాలకు చెందిన వారు వివాహ సంబంధాలు కుదుర్చుకున్నారు. కల్యాణ వేదిక కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్సీ ఎన్.రాంచందర్‌రావు ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్.ప్రభాకర్, కార్పొరేటర్లు శ్రవణ్, రాజ్యలక్ష్మి, సునీతా చంద్రశేఖర్, బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు రామ్మోహన్, కామరాజు నరేంద్రకుమార్, కల్యాణవేదిక ప్రధాన కార్యదర్శి కేకేబీఏ.శర్మ, రాంబాబు, వాసుదేవరావు, వుణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మను దర్శించుకున్న స్వామి స్వరూపానందేంద్ర


ఎల్లమ్మ తల్లిని దర్శించుకుంటున్న విశాఖ శారదా పీఠాధిపతులు స్వరూపానందేంద్ర సరస్వతి స్వామి

అమీర్‌పేట, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : బల్కంపేట ఎల్లమ్మ పోచమ్మ ఆలయాన్ని ఆదివారం సాయంత్రం సందర్శించిన విశాఖ శ్రీ శారదా పీఠాధిపతులు స్వామి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామికి ఆలయం ఈవో కుంట నాగరాజు, చైర్మన్ సాయిబాబాగౌడ్ ఘన స్వాగతం పలికారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ గర్భగుడిలోకి తీసుకువెళ్లారు. స్వామీజీకి శేష వస్త్రం బహూకరించడంతో పాటు తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా స్వరూపానందేంద్ర సరస్వతి స్వామి మాట్లాడుతూ దేశంలో ఉన్న 18 శక్తి పీఠాలలో అతి శక్తివంతమైనది ఎల్లమ్మతల్లి అన్నారు. ఆధ్యాత్మిక చింతనతో అమ్మవారిని దర్శించుకుంటే సిరిసంపదలు, ఆయురారోగ్యాలు కలుగుతాయన్నారు.


నూతన అధ్యక్షుడు సుధాకర్‌తో ఆర్యవైశ్యసంఘం నాయకులు

వారాసిగూడ ఆర్యవైశ్యసంఘం అధ్యక్షుడిగా కె.సుధాకర్

బౌద్ధనగర్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): వారాసిగూడ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా బౌద్ధనగర్‌కు చెందిన కూరాకుల సుధాకర్ నియమితులయ్యారు. ఆదివారం బీఎస్ఆర్ గార్డెన్‌లో జరిగిన హోరాహోరీ ఎన్నికల్లో ప్రత్యక్ష అభ్యర్థి కాచం రాముపై 44 ఓట్ల మెజార్టీతో సుధాకర్ విజయం సాధించారు. సికింద్రాబాద్ పట్టణ ఆర్యవైశ్య మహాసభ మాజీ అధ్యక్షులు చల్లాప్రకాశ్ ఎన్నికల అధికారి పర్యవేక్షణలో ఈ ఎన్నికలు జరిగాయి. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ ఆర్యవైశ్య కులస్తుల బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. ఆర్యవైశ్యుల సమస్యల పరిష్కారానికి పాటుపడతానన్నారు. నూతన అధ్యక్షుడిగా ఎన్నికల్లో గెలుపొందిన సుధాకర్‌ను ఆర్యవైశ్యసంఘం ముఖ్యనాయకులు మల్యాల జగదీశ్వర్, అల్లాడి హరీష్‌రావు, పాలూరి సురేష్, బెజుగాం శ్రీనివాస్, పోకల మధుకర్, అధ్యక్షుడు బెలిదే నరసింహారావులు సత్కారించి శుభాకాంక్షలు తెలిపారు.

ఎనిమిదేళ్లుగా అద్దె భవనంలోనే..

అరకొర సౌకర్యాలతో నెట్టుకొస్తున్న అల్వాల్ మండల కార్యాలయం సిబ్బంది


అల్వాల్ మండల కార్యాలయం(ఫైల్)

అల్వాల్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): అల్వాల్ మండల కార్యాలయం ఇప్పటికీ అద్దె భవనంలోనే ఉంటుంది. అల్వాల్ మండలాన్ని ఏర్పాటుచేసి దాదాపు 8 సంవత్సరాలవుతున్నా నేటికీ సమస్యలు పరిష్కారం కావడంలేదు. ప్రజలకు మెరుగైన పాలనను అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం 2016 అక్టోబర్ 11న కొత్త జిల్లాలు, మండలాలకు శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. దానిలో భాగంగా మల్కాజిగిరి-మేడ్చల్ జిల్లా పరిధిలోని అల్వాల్ ప్రాంతాన్ని మండలంగా గుర్తించి కార్యాలయాన్ని ప్రారంభించారు. సిబ్బందికి అనుగుణంగా అన్ని సౌకర్యాలు కలిగిన శాశ్వత భవనం లేకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.

శాశ్వత భవనం ఎప్పుడో..

కార్యాలయాన్ని ముందుగా ఓల్డ్ అల్వాల్‌లోని పెట్రోల్ బంక్ సమీపంలో నెలకు రూ.35వేల అద్దెతో ఒప్పందం చేసుకొని రేకుల గదుల్లో ప్రారంభించారు.

మూడేళ్ల తరువాత స్థల యజమాని ఖాళీ చేయమనడంతో అంబేడ్కర్‌నగర్‌లోని ప్రధాన రోడ్డు వద్ద గల భవనంలోకి మార్చారు. ప్రస్తుతం నెలకు రూ.33వేల కిరాయి చెల్లిస్తున్నారు. ఇక్కడ కూడా ఇరుకైన గదుల కారణంగా అటు ఉద్యోగులు, ప్రజలు ఇబ్బందికి గురవుతున్నారు. సరైన పార్కింగ్ సౌకర్యం కూడా లేకపోవడం సమస్యగా మారింది. నిర్ణీత సమయంలో ప్రభుత్వం అద్దె చెల్లించకపోవడంతో సదరు భవన యజమాని తరుచూ కార్యాలయానికి తాళం వేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.